క్లుప్తంగా

ఓటుహక్కుపై అవగాహన



అవగాహన కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

చందంపేట: మండలంలోని పోలేపల్లి గ్రామంలో ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల దేవరకొండ ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని గత మూడు రోజులుగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామ రిసోర్స్ పర్సన్ సుమలత, వారి టీంతో పాటు ఎంకేఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు గ్రామస్తులకు శుక్రవారం ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అదేవిధంగా మహిళా సాధికారత, బాల్యవివాహాలు, భ్రూణ హత్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శారదాదేవి, మకట్‌లాల్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

కోదండ రామాలయంలో కుంకుమార్చన

పెద్దఅడిశర్లపల్లి: మండలంలోని దుగ్యాల గ్రామంలో గల కోదండ రామాలయంలో శుక్రవారం కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ చైర్మన్ గుడి గోపురం నరేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆధ్వర్యంలో ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మారం శ్రీనివాస్‌చే రామాయణం, భారత, భాగవత ప్రవచనాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, రాములమ్మ, రాంరెడ్డి, ఆంజనేయులు, శేఖర్, వెంకన్న, పర్వతాలు ఉన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

త్రిపురారం: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ అనుముల పాండమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్యప్రభ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ, జెడ్పీటీసీతో పాటు మండలంలోని ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖలకు సంబంధించిన మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికతో హాజరు కావాలని పేర్కొన్నారు.

కల్లుగీత కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చందంపేట: కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని చందంపేట మండల గౌడ సంఘం అధ్యక్షుడు కాకునూరి శంకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం చందంపేట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అనేక కార్పొరేషన్‌లకు చైర్మన్‌లను ప్రకటించి కల్లుగీత కార్పొరేషన్ ప్రకటించకపోవడం బాధాకరమన్నారు. కల్లుగీత వృత్తిపై అనేక మంది గీత కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని, కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, నిధులు కేటాయించాలని కోరారు.

24 నుంచి రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన రామలింగేశ్వరస్వామి ఆలయం

చింతపల్లి: మండల పరిధిలోని వెంకటంపేట గ్రామంలో గుట్టపై కొలువుదీరిన శ్రీ భవాని రామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 24 నుంచి 27వరకు నిర్వహించనున్నారు. 24న రామలింగేశ్వరస్వామి గ్రామ ఊరేగింపు, కామ దహనం, 25న అభిషేకం, వ్రతాలు, 26న వన భోజనాలు, 27న కల్యాణం, అన్నదానం, 28న అభిషేకం, వన వాసం, అఖండ భజన జాగరణ, 29న రథోత్సవం, హోలీ, 29న జాతర ముగింపు ఉంటుందని ఉత్సవ కమిటీ శుక్రవారం తెలిపింది.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులో నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం కొండమల్లేపల్లి పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఢిల్లీ సీఎం అరెస్టు అప్రజాస్వామికం

నల్లగొండ రూరల్: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యార శ్రీను అన్నారు. శుక్రవారం నల్లగొండలో ఆయన మాట్లాడుతూ దేశంలో మూడో అతి పెద్ద రాజకీయ పార్టీగా ఆమ్ ఆద్మీ ఎదగడాన్ని బీజేపీ ఓర్వలేకపోతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

గడువు వారం రోజులే..

- ఆర్థిక సంవత్సరం పూర్తయ్యేలోపు వంద శాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళిక
- మొండి బకాయిదారులకు నోటీసులు జారీ
- దేవరకొండలో ఇప్పటి వరకు 66.46శాతం పన్ను వసూలు
- మిర్యాలగూడలో వసూలు కావాల్సిన బకాయిలు సుమారు రూ.17 కోట్లు



దేవరకొండలో పన్ను చెల్లించిన వారికి రశీదు అందజేస్తున్న కమిషనర్

దేవరకొండ: మున్సిపాలిటీకి ప్రధాన ఆదాయ వనరైన ఆస్తిపన్ను వసూళ్లపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు సమయం గడువు దగ్గర పడుతుండడంతో వంద శాతం పన్నుల వసూలే లక్ష్యంగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో పూర్తి స్థాయిలో పన్నులను రాబట్టాలని అధికారులు వార్డుల వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. ఇప్పటికే మొండి బకాయిదారుల వివరాలతో కూడిన జాబితాను సిద్ధం చేసి వారికి నోటీసులు అందజేశారు.

ప్రత్యేక కార్యాచరణ..

ఆస్తి పన్ను వసూళ్లకు సంబంధించి మున్సిపల్ అధికారులు ఇప్పటికే కార్యాచరణ రూపొందించారు. ప్రచార సాధనాలు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్న వారికి నోటీసులు సైతం జారీచేశారు. పన్నుల వివరాలను గృహ యజమానులకు సెల్‌ఫోన్‌ల ద్వారా మెసేజ్‌లు పంపుతున్నారు. ఇప్పటి వరకు 66.46శాతం పన్నులు వసూలైనట్లు అధికారులు పేర్కొంటున్నారు. మున్సిపాలిటీ పరిధిలో 6,938 అసెస్‌మెంట్లు ఉండగా ఇందుకుగాను దాదాపు రూ.2కోట్ల 94లక్షల మేర ఆస్తి పన్ను వసూలు లక్ష్యం ఉంది. కాగా ఇప్పటివరకు రూ.కోటి95లక్షలు వసూలు కాగా మరో రూ.98.79 లక్షల మేర బకాయిలు ఉన్నట్లు మున్సిపల్ అధికారులు చెబుతున్నారు.

బకాయిలు పేరుకుపోవడంతో..

మున్సిపాలిటీలో ఆస్తి పన్ను వసూళ్లల్లో జాప్యం కారణంగా పెద్ద మొత్తంలో బకాయిలు పేరుకుపోయాయి. వీటిని వసూలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను వడ్డీపై రాయితీ ప్రకటించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను పన్నులు చెల్లించని వారు దీనికి అర్హులు. మార్చి 31 వరకు గడువును విధించారు. కాగా 90శాతం వడ్డీ రాయితీపై కూడా ఆస్తి పన్నుల బకాయిదారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం.

సకాలంలో పన్నులు చెల్లించాలి



దేవరకొండ మున్సిపాలిటీ పరిధిలో వంద శాతం ఆస్తి పన్ను వసూలుకు చర్యలు చేపట్టాం. ఇందుకు సంబంధించి వార్డుల వారీగా 30మంది సభ్యులతో టీం ఏర్పాటు చేసి ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మొండి బకాయిదారుల వివరాలు సేకరించి నోటీసులు జారీ చేశాం. ప్రజలు సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలి.

– భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, దేవరకొండ

మిర్యాలగూడలో స్పందన అంతంతే..

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో ఆస్తి పన్నుల బకాయిలు మరింత పెరిగిపోయాయి. రెసిడెన్షియల్, నాన్ రెసిడెన్షియల్, మిక్స్‌డ్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల నుంచి ఆస్తి పన్నుల రూపంలో 25,606 గృహాల నుంచి రూ.25,45,07000 వసూలు చేయాలనే లక్ష్యం ఉంది. ఇప్పటి వరకు సుమారు 8,70,89,000 వసూలు చేశారు. ఇంకా సుమారు రూ.17 కోట్ల వరకు వసూలు కావాల్సి ఉంది. వీటి రికవరి కోసం రాష్ట్ర ప్రభుత్వం గత నెల 27వ తేదీ నుంచి వడ్డీపై 90శాతం రాయితీ (వన్ టైమ్ సెటిల్‌మెంట్) ప్రకటించింది. రాయితీని వినియోగించుకొని సకాలంలో ఆస్తి పన్నులు పూర్తిగా చెల్లించాలని ఇంటింటికి వెళ్లి చెల్లింపుదారులను విన్నవిస్తున్నప్పటికీ స్పందన అంతంత మాత్రంగానే ఉంది. గత కొన్ని రోజులుగా మున్సిపల్ కమిషనర్ ఎండీ యూసుఫ్ పర్యవేక్షణలో మున్సిపల్ ఆర్‌ఓ కళ్యాణి ఆధ్వర్యంలో ఇద్దరు ఆర్ఐలు రాకేష్, రవితోపాటు, ఆరు బృందాలుగా 12 మంది సిబ్బందితో ఆస్తి పన్నులు వసూలు చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం కేవలం 7 రోజులు మాత్రమే మిగిలింది. ఈ లోగా లక్ష్యం చేరుకోవాలని ఇటీవల మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. కాగా.. పాత బకాయిలు ఉన్న ఇంటి యాజమానులకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశారు. బకాయిదారులు ఇచ్చిన రెడ్ నోటీసుకు స్పందించకుంటే ఆస్తులను జప్తు చేసేందుకు మున్సిపల్ అధికారులు ఇప్పటికే సిద్ధమయ్యారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ సబ్‌స్టేషన్ నుంచి వన్‌టౌన్ పరిధిలో గల బంగారుగడ్డ, సీతారాంపురం, శాంతినగర్, సంతోష్‌నగర్, అశోక్ నగర్ ప్రాంతాలకు శనివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్ కో ఏఈలు వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ బంగారుగడ్డ ఫీడర్, సీతారాంపురం ఫీడర్, టూ టౌన్ పరిధిలోని 11 కేవీ శాంతినగర్ ఫీడర్, అశోక్‌నగర్ ఫీడర్‌లలో చెట్ల కొమ్మలు తొలగిస్తున్నందున విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బీఎల్‌ఓల సమావేశం

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల స్థాయి బీఎల్ఓల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి బీఎల్‌ఓలకు పలు సూచనలు ఇచ్చారు. సమావేశంలో ఆర్ఐ శ్యాం, బీఎల్‌ఓలు మణెమ్మ, రమ తదితరులు పాల్గొన్నారు.



అడవిదేవులపల్లి: మాట్లాడుతున్న తహసీల్దార్ సురేష్‌కుమార్

నర్సరీల పరిశీలన



నర్సరీ పరిశీలిస్తున్న ఎంపీడీఓ కరుణాకర్‌రావు

అడవిదేవులపల్లి: మండలంలోని చిట్యాల, కొత్తనందికొండ గ్రామాల్లోని నర్సరీలను శుక్రవారం ఎంపీడీఓ కరుణాకర్‌రావు పరిశీలించారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదే విధంగా మెట్లతండాలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పర్యవేక్షించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు కృష్ణారెడ్డి, శారద తదితరులున్నారు.

జలవనరులను సంరక్షిద్దాం



మాట్లాడుతున్న ఖాజా ఖైరత్‌అలీ

దేవరకొండ: జలవనరుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని యాక్షన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు ఖాజా ఖైరత్‌అలీ అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం దేవరకొండ పట్టణంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు బీబీ ఫాతిమా, మహమూద్ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: ధాన్యం కొనుగోలు విషయంలో మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడలోని ఆయా రైస్ మిల్లులను ఆయన సందర్శించి మిల్లర్లతో మాట్లాడారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, ధాన్యానికి మద్దతు ధర అందించి రైతులను ఆదుకోవాలన్నారు. ఇప్పటికే పలుమార్లు మిల్లర్లను హెచ్చరించినా కొన్ని మిల్లులు రైతులను ఇబ్బందులు పెడుతున్నాయని, మొండివైఖరి చూపించే మిల్లులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు, రైతులు ఉన్నారు.

సోదర భావానికి ప్రతీక ఇఫ్తార్

మిర్యాలగూడ: సోదర భావానికి ప్రతీక రంజాన్ ఇఫ్తార్ అని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ నాయకుడు అబ్దుల్లా ఆధ్వర్యంలో మిర్యాలగూడ పట్టణంలోని పెద్ద మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో మహిమూద్‌అలీ, మలౌనా మగ్దుం, అహ్మద్‌బావుష్, అక్బర్, కరీముల్లా, నూకల వేణుగోపాల్‌రెడ్డి, చిలుకూరి బాలు, అజారుద్దీన్, జమ్మియతుల్, సమీఖాద్రి, జాని, దేశిడిశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, ఖాజా హమీదొద్దీన్, రఫీ, వాహీద్ తదితరులు పాల్గొన్నారు.



మిల్లర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

కార్యకర్తలకు అండగా కాంగ్రెస్ పార్టీ



జానారెడ్డి, బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నాయకులు

చింతపల్లి: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుందని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కుందూరు జానారెడ్డి అన్నారు. శుక్రవారం చింతపల్లి మండలం మాల్ వెంకటేశ్వరనగర్‌లోని ఊరె యాదయ్య గార్డెన్స్‌లో వివిధ పార్టీల నుంచి జానారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జానారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లుగా పార్టీని నమ్ముకొని ఉన్న దేవరకొండ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ అండదండలు ఉంటాయని తెలిపారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో నల్లగొండ పార్లమెంట్ స్థానంతో పాటు అన్ని పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేయడం ఖాయమన్నారు. ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో గోపిడి కృష్ణారెడ్డి, గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాస భాస్కర్, ఉజ్జిని నరేందర్‌రావు, ఈరేటి మల్లేశ్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు నాగభూషణం, సంజీవరెడ్డి, యాదగిరి, నర్సింహారెడ్డి, వెంకటయ్యగౌడ్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీసీ సంఘం నేతలు

మిర్యాలగూడ టౌన్: బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ మంజూరై విదేశాల్లో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి లింగం గౌడ్ కోరారు. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రి వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు. బీసీల జనాభాకు తగిన విధంగా విదేశీ విద్యా స్కాలర్‌షిప్‌ల సంఖ్యను 300 నుంచి కనీసం 2వేలకు పెంచాలన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో తాటికొండ విక్రమ్, ఇంద్రం తదితరులున్నారు.

ట్రాక్టర్, బైక్ ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

డిండి: ట్రాక్టర్ ట్రాలీకి బైక్ ఢీకొట్టిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన శుక్రవారం డిండి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండల పరిధిలోని రత్నతండాకు చెందిన సభావట్ రాజు గ్రామం నుంచి ట్రాక్టర్ నడుపుతూ మండల కేంద్రానికి వస్తున్నాడు. అదే మార్గం గుండా డిండికి బైక్‌పై వస్తున్న నగారా దుబ్బతండాకు చెందిన రమావత్ రాజు స్థానిక పీహెచ్‌సీ సమీపంలో అకస్మాత్తుగా ట్రాక్టర్ యూటర్న్ తీసుకోవడంతో అదుపుతప్పి ట్రాలీని ఢీ కొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న రాజు రోడ్డుపై కిందపడి తలకు తీవ్ర గాయాలు కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ సీమపంలో ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరకొని వివరాలు సేకరించారు. బాధితుడి బాబాయి రమావత్ శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ.రాజు తెలిపారు.

ముగిసిన బార్ అసోసియేషన్ నామినేషన్లు



మిర్యాలగూడ బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి నామినేషన్ వేస్తున్న రామకృష్ణారెడ్డి

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ బార్ అసోసియేషన్ ఎన్నిక ప్రక్రియలో భాగంగా శుక్రవారం నామినేషన్ల స్వీకరణ ముగిసింది. మొత్తం 15 పదవులకు 24 మంది నామినేషన్లు వేశారని ఎన్నికల అధికారులు ఏచూరి శ్రీనివాస్, రెడ్డిపల్లి సైదులు తెలిపారు. శనివారం నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందని, 28న ఎన్నికలు జరగనున్నట్లు పేర్కొన్నారు. కాగా.. అధ్యక్ష పదవికి మహంకాళి రాజేష్, గుర్రం రామకృష్ణారెడ్డి, సకినాల వేలాద్రి, గౌరు వెంకటేశ్వర్లు నామినేషన్ వేశారు. ఉపాధ్యక్ష పదవి –1కి ఇబ్రహీం, ఉపాధ్యక్ష – 2కి స్వామిప్రసాద్ నామినేషన్ వేశారు. ప్రధాన కార్యదర్శికి అలుగుబెల్లి రాజ్‌కుమార్, మట్టపల్లి శ్రీధర్, విగ్రహాల సుధాకర్‌రావు, సకినాల వేలాద్రిలు నామినేషన్లు వేశారు. కోశాధికారికి ముడుసు వెంకట పవన్ కుమార్ వేశారు. సహాయ కార్యదర్శి–1 డి. శ్రీదేవి, కె. వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శి–2 కి మోదాల మల్లేష్, వెంకటదుర్గాప్రసాద్ నామినేషన్లు వేశారు. గేమ్స్అండ్ కల్చరల్‌కు బాణాల ఉమాశంకర్, కొంక వెంకన్న, లైబ్రరీ కార్యదర్శికిగా రవినాయక్, బాణాల ఉమాశంకర్, మహిళా రిప్రెజెంటేటివ్‌గా జ్యోతి, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా భాస్కర్, గంగాభవాని, నాగేందర్, రామకృష్ణ నామినేషన్లు వేసినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు.

తల్లిపాలతోనే శిశువులకు ఆరోగ్యం



మిర్యాలగూడలో చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ లీలాకుమారి



ఆగామోత్కూర్ గ్రామంలో పౌష్టికాహారం ఆవశ్యకతను వివరిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

మిర్యాలగూడ టౌన్: తల్లిపాలు తాపితేనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలకుమారి అన్నారు. శుక్రవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో గల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే అరగంటలోపే తల్లిపాలు పట్టించడంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగలక్ష్మి, రజిత, గుంటి విజయ, భారతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

యాద్గార్‌పల్లిలో..

మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ పక్షం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు భాగ్యలక్ష్మి, లక్ష్మి, సత్యలక్ష్మి, నాగూర్‌బీ తదితరులున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మాడుగులపల్లి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్ వైజర్లు రజిని, నాగమణి అన్నారు. మాడుగులపల్లి మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో శుక్రవారం పౌష్టికాహారం ఆవశ్యకతపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. నిత్యం తీసుకునే ఆహారంలో ఆకుకూరలు, చిరుధాన్యాలు, పండ్లు, పాలు, గుడ్లు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఎండల తీవ్రత అధికంగా ఉన్నందున ఓఆర్ఎస్, మజ్జిగ, మంచినీరు అధికంగా తాగాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హేమలత, షకీరాభాను, పద్మ, సరిత, రాణి, చంద్రకళ, పార్వతి, రాములమ్మ పాల్గొన్నారు.

శాలివాహనులు రాజకీయంగా ఎదగాలి

కొండమల్లేపల్లి: శాలివాహనులు రాజకీయంగా ఎదగాలని శాలివాహన సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు తోటపల్లి కిరణ్ అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలో శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి మహారాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాలివాహనులు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏరుకొండ రాము, నీలకంఠం రాములు, బొడ్డుపల్లి మల్లయ్య, శంకర్, యాదగిరి, మల్లేశ్, శంకర్, వెంకటయ్య, దశరథం, సైదులు, కలమ్మ, శంకర్, శ్రీను, బత్తుల పరమేశ్, నిరంజన్, విజయ్, తిరుపతయ్య, బాలకృష్ణ, ఏరుకొండ సైదులు పాల్గొన్నారు.

శాలివాహన చక్రవర్తి జయంతి

మిర్యాలగూడ టౌన్: పట్టణంలోని ఎన్ఎస్‌పీ క్యాంపులో శుక్రవారం కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో శాలివాహన చక్రవర్తి జయంతి నిర్వహించారు. ముందుగా చక్రవర్తి చిత్రపటానికి ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు మల్లికంటి వెంకటయ్య నివాళులర్పించారు. కార్యక్రమంలో చిల్లాపురం గ్రామ శాఖ అధ్యక్షుడు మల్లికంటి అంజయ్య, బీసీ సంఘం నాయకులు చెగొండి మురళీ యాదవ్, కిరణ్, సురేష్, మల్లికంటి నాగమ్మ తదితరులున్నారు.



మిర్యాలగూడలో శాలివాహన చక్రవర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకటయ్య

సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న డీవీ నాయక్

పెద్దవూర: విద్యా క్యాలెండర్ ప్రకారం సిలబస్‌ను సకాలంలో పూర్తి చేసి ఏప్రిల్ 8 నుంచి జరగనున్న ఎస్ఏ–2కు విద్యార్థులను సంసిద్ధులను చేయాలని గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏసీఎంఓ) డివి.నాయక్ అన్నారు. శుక్రవారం పెద్దవూరలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు పట్టికలు, విద్యార్థుల ప్రోగ్రెస్ రిపోర్టును పరిశీలించి మాట్లాడారు. పదో తరగతిలో 9జీపీఏ పైగా సాధిస్తే ప్రభుత్వం ఉచితంగా కార్పొరేట్ కళాశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తుందని పేర్కొన్నారు. మూడు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు తరచూ స్లిప్ టెస్టులు నిర్వహించి పరీక్షలంటే భయాన్ని పోగొట్టాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల హెచ్ఎం ధీరావత్ బాలోజీ, ఉపాధ్యాయులు కూన్‌రెడ్డి రాంరెడ్డి, బి.కృష్ణ, సురేందర్, డి.సైదులు, సంధ్య, షాహిన్‌బేగం, డి.రామయ్య, శాంతి తదితరులు ఉన్నారు.

విద్యార్థినులకు జాబ్‌మేళా

మిర్యాలగూడ: పట్టణంలోని మినా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలైన హైకీ, 24/7ఏఐ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా హైకీ కంపెనీ డైరెక్టర్ గౌతంరెడ్డి, టాస్క్ క్లస్టర్ మేనేజర్ జి.సుధీర్ మాట్లాడుతూ జాబ్ మేళాలో విద్యార్థినులకు వివిధ అంశాలపై ఇంటర్వ్యూ నిర్వహించి నిపుణత సాధించిన వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. హైకీ కంపెనీకి 21 మంది, 24/7ఏఐకు 80 మందిని ఎంపిక చేశామని పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ ఎండీ మహమ్మద్‌అలీ మాట్లాడుతూ మిర్యాలగూడ పరిసర ప్రాంతాల నుంచి దాదాపు 300 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ షహలాబుతుల్, ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, ప్రిన్సిపాల్ వాణి, ఫయాజ్, రమేష్ పాల్గొన్నారు.



నియామకాలు పొందిన విద్యార్థినులతో కళాశాల అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు

నేటి నుంచి ఎర్రబెల్లి జాతర

- యాదవులకు ఆరాధ్య దైవం లింగమంతుల స్వామి
- నాలుగు రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- రేపు రాత్రి స్వామివారి కల్యాణం



లింగమంతుల స్వామి ఆలయం

నిడమనూరు: నిడమనూరు మండలం ఎర్రబెల్లిలోని లింగమంతుల స్వామి జాతర శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఉమ్మడి జిల్లాలోనే ప్రసిద్ధి చెందిన ఎర్రబెల్లి జాతర ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి నిర్వహిస్తారు. ఈనెల 23 శనివారం రాత్రి 8గంటలకు ఎర్రబెల్లి మందగంపతో స్వామివారి ప్రదక్షణ, 24న ఆదివారం రాత్రి 8 గంటలకు తల్లిగంప, అర్ధరాత్రి 2గంటలకు మాణిక్యాలదేవి–లింగమంతుల స్వామి కల్యాణోత్సవం, 25 సోమవారం ఉదయం 8గంటలకు నైవేద్యం (బోనాలు) సమర్పించడం, మధ్యాహ్నం 2 గంటలకు యలమంచమ్మ బోనాలు, 26న మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు మాణిక్యాలదేవి గొర్రెల మంద ప్రవేశంతో జాతర ముగుస్తుంది. ఉమ్మడి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలతో పాటు ఏపీ నుంచి కూడా భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి జాతరకు వస్తుంటారు. చెంచు వారి ఆరాధ్య దేవత యలమంచమ్మకు ఇక్కడ బోనాలు సమర్పించడం ఇక్కడి ఆనవాయితీ.

జాతరకు ప్రేరణ.. ప్రేమ కథ

ఎర్రబెల్లి జాతర వెనుక స్వామి వారి ప్రేమ కథ ఉంది. ఎర్రబెల్లి గుట్ట వద్ద చెంచులు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటూ వరహాల పోషణతో జీవనం సాగించే వారు. చెంచు గూడెం పెద్ద ఎనుబోతునాయుడు ఎనిమిది కుమారుల తోడ మాణిక్యాల దేవి ఒక్కతే కూతురు. జీవాలను మేపేందుకు లింగమంతుడు తన సోదరుడితో కలిసి గుట్టకు వచ్చే వాడు . అక్కడ గూడెంలో మాణిక్యాలదేవిని చూసిన లింగమంతుడు తన ఇష్టాన్ని చెప్పగా ఆమె తిరస్కరిస్తుంది. అలా కొంత కాలానికి మాయోపాయంతో మత్తుపానీయలు ఇచ్చి నిద్రమత్తులోనే మాణిక్యాలదేవిని వివాహం చేసుకుంటాడు. వివాహం విషయం తెలిసి గూడెం నాయకుడు ఎంబోతునాయుడు, అతని కుమారులకు లింగమంతునికి మధ్య ఘర్షణ జరుగుంది. అలా అందరూ గుట్టలోని చెరికలోకి చేరుకుంటారు. అక్కడ లింగమంతుడు వారికి శివుని రూపంలో దర్శనం ఇస్తాడు. దేవుడే తమ కూతురును వివాహం చేసుకున్నాడని తెలుసుకుని సంతోషంగా తదుపరి ఏర్పాటు చేస్తారు. అప్పటి నుంచి యర్రబెల్లి గుట్ట వద్ద లింగమంతుల స్వామి జాతర జరుగుతూ వస్తోంది.

ఏర్పాట్లు పూర్తి



లింగమంతుల స్వామి జాతరకు ఏర్పాటు పూర్తి చేశాము. తాగు నీటికి భక్తులు ఇబ్బంది పడకుండా వాటర్ ట్యాంక్‌తో పాటు, ట్రాక్టర్ ట్యాంకర్‌లను అందుబాటులో ఉంచాము. భక్తులు అధిక సంఖ్యలో జాతరకు హాజరై లింగమంతుల స్వామి కృపకు పాత్రులు కావాలి.

– మట్టయ్య, లింగమంతుల స్వామి దేవాలయ చైర్మన్, ఎర్రబెల్లి